

# మందు

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాద్

శ్రవణ రాజ్యంలో నివశించే పద్మపాదుడు, ప్రభుదాసు ప్రాణ స్నేహితులు. పద్మపాదుడు వైద్యశాస్త్రంలో దిట్ట. గొప్ప హస్తవాసిగల వైద్యుడిగా పేరు గడించాడు. ప్రభుదాసు మంచి వ్యవసాయదారుడు. పంటలు పుష్కలంగా పండించిన రైతుగా గుర్తింపు పొందాడు.

ఇదిలా ఉండగా శ్రవణ రాజ్య మహారాజు చక్రధరుడికి కడుపునొప్పి పట్టుకుంది. రాజవైద్యుడు ఎంత ప్రయత్నించినా, ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కన్పించలేదు. ఇంకా కాలయాపన చేస్తే 'మహారాజు దక్కడేమో' అని, మహారాజుకొచ్చిన కడుపునొప్పి విషయం దండోరా వేయించి, దానికి చికిత్స చేసి ఎవరు తగ్గిస్తే వారిని మహారాజుకి అంతరంగిక వైద్యుడిగా నియమించడం జరుగుతుందని మాట ఇచ్చాడు మంత్రి మాధవవర్మ.

నిజానికి మహారాజుకి రాజ వైద్యుడిగా ఉండాలనేది పద్మపాదుడి చిరకాల వాంఛ. దానికై గతంలో ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ సఫలమవ్వలేదు. ఇప్పుడొచ్చిన ఈ అవకాశం భగవంతుడు కల్పించినది. ఎలాగైనా సద్వినియోపరు చుకోవాలని అహెూరాత్రులు వైద్య గ్రంథాలు పఠించాడు. నిపుణులైన వైద్యులతో చర్చించాడు. చివరికి మందు తెలుసుకుని, కాలసిన మూలికలు హిమాలయాల వద్ద నుండి సేకరించి మందు తయారుచేసుకున్నాడు.

మరుసటిరోజు ముందుగా గుడికెళ్ళి ఆ ఔషధానికి పూజ చేయించుకొని, తను మహారాజునికలవడానికి వెళు తున్నానని చెప్పాడు పద్మపాదుడు. తనూ వస్తానని అనుసరించాడు ప్రభుదాసు.

రాజభవనంలోని రాజవైద్యుడి అనుచరులు వీళ్ళకెన్నో ఆటంకాలు కలిగించారు. కానీ మొత్తానికి మహారాజు వద్దకు చేరుకున్నారు ఆ స్నేహితులిద్దరూ.

రాజు కడుపు పట్టుకుని విలవిల్లాడుతున్నాడు. పద్మ పాదుడు 'మహారాజా, ఈ ఔషదాన్ని ముమ్మారు సేవిస్తే మీ కడుపునొప్పి ఇట్టే మాయమయిపోతుంది' అని మందుసీసాను మహారాజుకి ఇవ్వబోయాడు.

అప్పుడు వెంటనే రాజ వైద్యుడు దాన్నందుకుని 'ఇది తాగాక ఒకవేళ కడుపునొప్పి తగ్గర మహారాజు మరణిస్తేనో?' అన్నాడు. అక్కడ వున్న ప్రభుదాసు 'మహారాజా, మీకు నమ్మకం కలిగించడానికి , నా స్నేహితుడి మందు మీదున్న నమ్మకంతో నేనే ముందు దీన్ని సేవిస్తాను" అన్నాడు మందుసీసా తీసుకుని.

అదివిని మంత్రి "మహారాజా, ఈ ఔషధం మీద, ఇది తయారు చేసిన పద్మపాదుడి మీద నీకు నమ్మకం కుదిరింది. మీరు నిరభ్యంతరంగా

తీసుకోవచ్చు"

మూడుసార్లు మందు వేసుకున్నాక మహారాజుకి కడుపునొప్పి తగ్గిపోయింది. ఆయన "నేను కడుపు నొప్పితో బాధ పడుతుంటే రాజవైద్యుడు సరైన చర్యలు తీసుకోలేదు. అందుచేత ఆయన్ని తొలగించి ఆ స్థానంలో పద్మపాదుడిని నియమిస్తున్నాను. అలాగే స్నేహానికి అర్థం చాటిన ప్రభుదాసుని రాజ్య వ్యవసాయ పర్యవేక్షకుడిగా నియమిస్తున్నాను" అన్నాడు.

# మీకు తెలుసా..!?



జిహొలార్నిస్ రెండు తోకలు కలిగివుండే పక్షి. ఈ పక్షి ఎప్పుడో 120 మిలియన్ సంవత్సరాల క్రితం అంటే సుమారు 12 కోట్ల ఏళ్లక్రితం చైనా భూభాగంలో జీవించేది.

నలుపురంగులో ఉండే పొడవైన దేహం, తలపై ఎర్రటి కిరీటం లాంటి భాగం.. దీనికి తోడు రెండు తోకలతో ఉండే ఈ వింత పక్షి మనం చూసే కోడంత పరిమాణంలో ఉండేది.

దీని మరో ప్రత్యేకత.. కాళ్ల గోళ్ళతోపాటు రెక్కలకు కూడా పదునైన గోళ్లుండేవి.

ఈపక్షి శిలాజాలు కొన్ని దశాబ్దాల క్రితమే దొరికాయి. అప్పుడు దీనిపై పరిశోధనలు మొదలెట్టారు. మొదట్లో ఈ పక్షికి ఒకే పెద్ద తోక వుందని, అది అలంకకరణ కోసం మాత్రమే ఉన్నట్టు భావించారు. కానీ అత్యాధునిక పరికరాలతో చేసిన పరిశీలనల్లో దీని శిలాజాల ఆధారంగా ఈ పక్షికి రెండు తోకలున్నట్లు కనుగొని, అంతా ఆశ్చర్యపోయారు. వెనుకభాగంలో ఉండే దీని రెండు తోకల్లో ఒకటిక పొడవుగా ఉండి చివరన ఈకలతో ఉంటుంది. మరోటి చిన్నగా మిగతా పక్షుల తోకల్లానే ఉంటుంది.

దీనికున్న ఈ భిన్న లక్షణాలన్నీ ఇవి హాయిగా జీవనం గడపటానికి, ఆహారం సంపాదించుకోవడానికి, శత్రువుల నుంచి కాపాడుకోవడానికి తోడ్పడేవి.

రెండు తోకల్లో చిన్నది ఎగరడానికి, పెద్దది ఈ పక్షి అందాన్ని చూపడానికి ఉపయోగపడేది. దీని పొడవాటి తోకపై చిన్నపాటి ఫ్యాన్ రెక్కలాంటి ఈకలు ఉండేవి. ఇవీ ఆకర్షణకే పనికొచ్చేవి.